క్లుప్తంగా

భవ్యశ్రీకి న్యాయం చేయాలి



నెహ్రూనగర్: చిత్తూరు జిల్లాలో ఇంటర్ చదువుతున్న మైనర్ బాలిక భవ్యశ్రీపై కిరాతకంగా అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితుల్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలని పలువురు బీసీ నాయకులు డిమాండ్ చేశారు. భవ్యశ్రీ హత్యను నిరసిస్తూ సోమవారం హిందూ కాలేజీ దగ్గర నుంచి లాడ్జి సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలికను చంపిన నలుగురు వ్యక్తుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు చంద్రగిరి ధీరజ్ పాల్గొన్నారు.

యార్డులో పారదర్శకంగా వ్యాపార లావాదేవీలు

చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో వ్యాపార లావాదేవీల్ని పారదర్శకంగా కొనసాగించాలని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సూచించారు. యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, పాలకవర్గ సభ్యులతో కలసి సోమవారం ఉదయం ఆయన యార్డును సందర్శించారు. వ్యాపార లావాదేవీలు, మిర్చి నాణ్యత, ధరలపై ఎగుమతి, దిగుమతి వ్యాపారుల్ని అడిగి తెలుసుకున్నారు. యార్డులో మిర్చి రైతులతో మాట్లాడారు. వసతులు ఏ విధంగా ఉన్నాయి.. గిట్టుబాటు ధర లభిస్తుందా..? లేదా? అడిగి తెలుసుకున్నారు. యార్డు ఆవరణలోని టీ స్టాల్స్, కూల్ డ్రింక్స్ షాపులు, బడ్డీ కొట్లను సందర్శించి, వారు విక్రయిస్తున్న ధరలు, నాణ్యతను ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ మిర్చి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించడంతో పాటు, మెరుగైన ధర లభించేలా చూడాలని వ్యాపారుల్ని ఆదేశించారు. దేశానికి వెన్నుముక అయిన అన్నదాతకు అన్ని విధాలుగా మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యార్డులో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యార్డును ప్రతి రోజు శుభ్రం చేయాలని చెప్పారు. యార్డు అధికారులు, సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భాషా, సాహిత్యాభివృద్ధికి వావిళ్ల సంస్థ ఎనలేని కృషి



లక్ష్మీపురం: 1854లో పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించి భాషా, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవలందించిన వావిళ్ల సంస్థ గురించి ఈతరం వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కవి, రచయిత, అధ్యాపకులు కె.జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వావిళ్ల సంస్థ గురించి తెలుసుకుందాం' అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వావిళ్ల సంస్థ వ్యవస్థాపకులు వావిళ్ల రామస్వామిశాస్త్రి ఆయన తనయుడు వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రులు సంస్కృతాంధ్ర భాషా, సాహిత్యాలకు అనేక రకాలుగా సేవలు అందించారన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ అనేక తాళ పత్ర గ్రంథాలకు చేతిరాతలతో పాటు ప్రాచీన కావ్యాల్ని పండితులతో పరిష్కరింపజేశారని తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రసంగించారు.

పలుచోట్ల గొలుసుల చోరీలు

పట్నంబజారు: పట్టణంలో సోమవారం పలుచోట్ల మహిళల మెడలో గొలుసుల చోరీలు జరిగాయి. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకుమానువారి వీధికి చెందిన మద్ది శాంతకుమారి రైలుపేటలోని గాంధీ విగ్రహం వద్ద పాల ప్యాకెట్లు విక్రయిస్తుంటారు. తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- పాత గుంటూరు ప్రాంతంలో రెండు చైన్ స్నాచింగ్‌లు సోమవారం ఉదయం జరిగాయి. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళదాస్‌నగర్‌కు చెందిన గ్రంధి లక్ష్మీసామ్రాజ్యం చిల్లర దుకాణం నడుపుతుంటారు. ఉదయం ఇద్దరు యువకులు పాలప్యాకెట్ల కోసం వచ్చామని చెప్పి ఆమె మెడలోని నానుతాడు లాక్కొని పరారయ్యారు. సుమారు నాలుగు సవర్లు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది.
- ప్రియా గార్డెన్స్ పరిధిలోని పొత్తూరి రమణకుమారి తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు పూలు కోసుకుంటుండంగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని 30 గ్రాముల గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా యాంటీ'భయా'టిక్స్‌తో ఆరోగ్యానికి ముప్పు

- అధిక వినియోగంతో ఇన్‌ఫెక్షన్ల దాడి
- వైద్యుల సలహాలు లేకుండా వాడితే ప్రమాదమే
- అవగాహన లేకపోతే ప్రాణాంతకం
- సెప్టెంబరు ఇన్‌ఫెక్షన్ల అవగాహన మాసం



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన అంకిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై హాస్పిటల్‌కు వెళ్లకుండా మందుల షాపునకు వెళ్లి యాంటీబయాటిక్స్ తెచ్చుకుని వాడాడు. కొద్దిరోజులపాటు ఆరోగ్యం సాధారణ స్థితికి వచ్చినట్లు కనిపించినా మరలా వ్యాధి తిరగబెట్టేసరికి పరిస్థితి విషమించి వైద్యుల్ని సంప్రదించాడు. అనవసరంగా యాంటీబయాటిక్స్ వినియోగించడం వల్ల సమస్య తలెత్తింది. ఆసుపత్రిలో ఉంచి మందులు వాడుతున్నా పనిచేయడం లేదని వైద్యులు నిర్ధారించి ఎక్కువ రోజులు చికిత్స చేశారు. ఇలా అవసరం లేకపోయినా, అవగాహన లేకుండా విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగించడంతో సమస్య వస్తున్నాయి. వ్యాధి నివారణకు వాడాల్సినవి కాకుండా ఇతర యాంటీబయాటిక్స్ వాడడం వల్ల శరీరంలో వ్యాధినిరోధకశక్తి తగ్గిపోయి అనేక మంది ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతున్నారు.

ప్రతి ఏడాది పెరుగుతున్న బాధితులు

ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇన్‌ఫెక్షన్ల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ఏడాది 7 నుంచి పది కోట్ల మంది ఇన్‌ఫెక్షన్ల బారిన పడి మరణిస్తున్నారు. ప్రతి 3.5 సెకన్లకు ఒకరు మరణిస్తున్నారు. ప్రతి ఏడాది 2.70 కోట్ల నుంచి 3 కోట్ల మంది ప్రజలు వ్యాధి బారిన పడుతున్నారు. అప్పుడే పుట్టిన చిన్నారులు మొదలుకొని, ఐదేళ్లలోపు పిల్లలు వరకు 60 లక్షల మంది ప్రతి ఏడాది ఇన్‌ఫెక్షన్లతో చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది సెప్టెంబరును 'వరల్డ్ సెప్సిస్ అవేర్‌నెస్ మంత్'గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లక్షణాలు

సెప్సిస్ అనేది ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్. ఇది సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులుగా ఉంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, విపరీతమైన నీరసం, తీవ్రమైన చలి, ఆయాసం, మూత్ర విసర్జన తగ్గిపోవడం, బీపీ తగ్గడం, పెరగడం, రోగి తికమక పడడం తదితర లక్షణాలు వ్యాధి బాధితుల్లో కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ

బ్లడ్ కల్చర్, కార్బ్యాఆర్, బయోఫయర్ టెస్ట్‌ల ద్వారా సెప్సిస్ వ్యాధిని నిర్ధారిస్తారు. అంటువ్యాధి కారకాలు, వాటి విషపూరిత పదార్థాల వ్యాప్తి. వాటి స్థానం నుంచి రక్త ప్రవాహంలో కలవడం ద్వారా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ఇది ఒక ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన జబ్బు. తక్షణమే గుర్తించి చికిత్స చేయని పక్షంలో శరీరంలోని పలు అవయవాలు పని చేయడం మానివేసి రోగి ప్రాణాలు కోల్పోతాడు.

వ్యాధి సోకే భాగాలు

ఇన్‌ఫెక్షన్లు నూటికి 50 శాతం ఊపిరితిత్తుల్లో వస్తాయి. తదుపరి కిడ్నీలు, బ్రెయిన్, యూరీనరి ట్రాక్ట్, చర్మం, ఇతర భాగాలకు సోకుతుంది. కడుపులో ఇన్‌ఫెక్షన్లు రావడంద్వారా అల్సర్లు ఏర్పడతాయి. క్యాన్సర్, షుగర్ బాధితులు, కాలిన గాయాల వారిలో, మేజర్‌ట్రామా బాధితుల్లో, హెచ్ఐవీ బాధితుల్లో సూక్ష్మ క్రిముల ద్వారా ఈ వ్యాధి త్వరితగతిన ఎక్కువ మందిలో వ్యాప్తి చెందుతుంది. కాళ్లలో పుండ్లు ఏర్పడి చీము పట్టి పరిస్థితి ప్రమాదంగా మారి కొన్నిసార్లు ఆపరేషన్ల ద్వారా ఆ గాయాల్ని తొలగించాల్సి వస్తుంది.

వైద్యుల సలహాలతోనే వాడాలి



సెప్సిస్ పెరిగేందుకు ప్రధాన కారణం ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్ వినియోగమే. దీన్ని కట్టడి చేసేందుకు వైద్యుల సలహాల మేరకు మాత్రమే వాడాలి. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. మరుగుదొడ్లు వినియోగించిన పిదప, భోజనానికి ముందు తప్పనిసరిగా కాళ్లు, చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. పరిశుభ్రమైన వస్త్రాలు ధరించడం, నిద్రించే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ రేవూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

- అర్జీలు ఓపెన్ అయితే సహించేది లేదు
- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే సహించేది లేదని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. అర్జీల్ని విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని ఆమె చెప్పారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని గుర్తించారు. ప్రజలు తిరిగి మరలా ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని, సదరు అర్జీల్ని విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్సు చేయాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆమె సూచించారు.

ప్రజల నుంచి 32 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 32 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి- 11, ఇంజినీరింగ్ విభాగానికి - 8, రెవెన్యూ విభాగానికి- 8, ప్రజారోగ్య విభాగానికి- 4, ఉపాసెల్ విభాగానికి -1 ఉన్నాయి. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంటు వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలు

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె సోమవారం జాకీర్ హుస్సేన్ నగర్, వినోభా నగర్, శీలంవారి వీధి, బాలాజీ నగర్, ఎల్‌బీ నగర్, లాలాపేట, పట్నం బజార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్ని తనిఖీ చేశారు. ప్రజారోగ్య అధికారులకు, శానిటేషన్ కార్యదర్శులకు తగు ఆదేశాలు జరీ చేశారు. తొలుత జాకీర్ హుస్సేన్ నగర్‌లో ఈ- ఆటో ద్వారా ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఆటో ఏ సమయానికి చెత్త సేకరణ కోసం వస్తోంది స్థానికుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శులు తప్పనిసరిగా మస్టర్ సమయానికి విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'బావ జనతా పార్టీ' అధ్యక్షురాలు పురందేశ్వరి

మంత్రి రోజా విమర్శ



పాత గుంటూరు: దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలో, బావ జనతా పార్టీ అధ్యక్షురాలో అర్థం కావడం లేదని పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి రోజా విమర్శించారు. సోమవారం గుంటూరువారితోట నాలుగో లైనులో అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన గణేశ్ ఉత్సవ మండపంలో మంత్రి రోజా వినాయకుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. పురందేశ్వరి గతంలో ఏం మాట్లాడిందో.. ఇప్పుడు ఏం మాట్లాడిందో చూస్తే అందరికీ అర్థమవుతుందని తెలిపారు. తన తండ్రికి, పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన గాడ్సేలాంటి వాడు చంద్రబాబు అని విమర్శించారు. ఐటీ నోటీసులు చంద్రబాబుకు ఇస్తే పురందేశ్వరీ నో కామెంట్ అనడం ఏంటని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వంలో ఉండి కేంద్ర సంస్థ అయిన ఐటీ నోటీసులపై ఆమె మాట్లాడను అనడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు అరెస్టుపై బీజేపీ ఖండిస్తుందంటే.. ప్రజలకు పురందేశ్వరి ఏం సందేశం ఇస్తుందో చూడాలని సూచించారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఉన్న 42 వేల బెల్టు షాపుల్ని శాశ్వతంగా నిర్మూలించింది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందంటే.. ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రభుత్వం సమయపాలన విధించి మద్యాన్ని నియంత్రిస్తుందని తెలిపారు. బెల్టు లేకుండా, ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మద్యాన్ని విక్రయిస్తుంటే ప్రజల్ని ఎక్కడ, ఎలా ప్రభుత్వం దోపిడీ చేస్తుందో పురందేశ్వరి చెప్పాలని రోజా కోరారు. నందమూరి వంశానికి ఒక అడ్రస్, గౌరవాన్ని, వారు లగ్జరీ చేస్తున్న జీవితాన్ని ఇచ్చిన ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించి, పార్టీని లాక్కుని ఆయన చావుకు కారణమైన 420 చంద్రబాబు వైఖరిపై నందమూరి కుటుంబసభ్యులు ఒక్కరు కూడా మాట్లాడిన పరిస్థితులు లేవన్నారు. ఇప్పుడు ఒక్కరు కూడా చంద్రబాబు చేస్తుంది తప్పు అని చెప్పే వారు లేరని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తులు లేవని తమకు లేవని సీబీఐ, ఈడీని దర్యాప్తు చేసుకోమని చంద్రబాబు కుటుంబ సభ్యులు కోరితే బాగుంటుందని పర్యాటక శాఖ మంత్రి రోజా సూచించారు.

జాషువా సాహిత్య ప్రాచుర్యమే లక్ష్యం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



సభలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

పాతగుంటూరు: మహాకవి జాషువా కళాపీఠం వ్యవస్థాపకులు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జాషువా జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఆడిటోరియంలో 'మహాకవి జాషువాకు గుంటూరు కవుల నివాళి' కార్యక్రమం నిర్వహించారు. సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ పాల్గొని మహాకవి జాషువా సాహిత్యంలో మహిళా ప్రాధాన్యత అంశం పై వివరణాత్మక ప్రసంగం చేశారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ జాషువా సాహిత్యం ప్రస్తుత సమాజంలోని ప్రజాబాహుళ్యంలో ప్రాచుర్యం చేసేందుకు తమ కళాపీఠం తరుపున ప్రతి సంవత్సరం జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ కవి కొమ్మువరపు విల్సన్ రావు మాట్లాడుతూ మహాకవి జాషువా సాహిత్యం అజరామరమని కొనియాడారు. హిందూ కళాశాల ఆచార్యులు ఎల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రసంగిస్తూ మహాకవి జాషువా సాహిత్యం ప్రస్తుత విద్యార్థులు చదవడం ఎంతో అవసరమన్నారు. అనంతరం కొమ్మువరపు విల్సన్ రావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కళాపీఠం కార్యదర్శి నూతక్కి సతీష్, వైయస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.

సంచార జాతులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

నెహ్రూనగర్: సంచార జాతులు, వేస్ట్ పికర్స్ నైపుణ్యాల్ని పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ సీహెచ్. శామ్యూల్ అనిల్‌కుమార్ తెలిపారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో వేస్ట్ పికర్స్, సంచార జాతులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణను ఆదివారం అమరావతి రోడ్డులోని మదర్ థెరిస్సా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ, విభజన, ప్రాసెసింగ్, సేకరించిన వ్యర్థాలకు మంచి ధర పొందడం వంటి అనేక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.సామాజిక కార్యకర్త నారాయణ, సంఘ నాయకులు మిక్కిలి సురేష్, శ్రీనివాస్, రవితేజ, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గాన గంధర్వుడు బాలుకు ఘన నివాళి



బాలు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): సినీ సాహిత్య పరిమళాల్ని సుమధుర స్వరం, స్పష్టమైన ఉచ్చారణతో సుసంపన్నం చేసి పలు భారతీయ భాషల్లో వేల పాటల్ని ఆలపించిన అమర గాయకుడు, గాన గంధర్వుడు, తెలుగు సినీ పాటలకు చిరునామా ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యమని బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో సోమవారం బాలసుబ్రహ్మణ్యం సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సినీ కళాకారుల్ని దృష్టిలో ఉంచుకొని వారికి అనుగుణంగా తన స్వరంలో విభిన్న మార్పులు చేసుకుంటూ పాడిన పాటలు, ఐదు దశాబ్దాల పాటు కొనసాగిన ఆయన గాన ప్రస్థానం నిరుపమానమైనదని వ్యాఖ్యానించారు. పలు టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ఔత్సాహిక గాయనీ, గాయకులకు ఆయన అందించిన ప్రోత్సాహంతోనే వందలాది మంది నూతన కళాకారులు జన్మించారనడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదని తెలిపారు. తెలుగు భాష భూమి మీద మనుగడ సాగినంత కాలం బాలు పాట వినపడుతూనే ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు భాష ఉచ్చారణ స్పష్టంగా ఉండాలని బాలు భావించేవారని గుర్తు చేశారు. ఆయనను స్మరించుకోవడం మనందరి బాధ్యతని సూచించారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ఎస్.సమీర్ నందన్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా వినాయకుడి నిమజ్జనోత్సవాలు



మంత్రివారివీధిలోని అయ్యప్ప రెసిడెన్సీ నుంచి నిమజ్జనానికి బయలుదేరిన మట్టి వినాయకుడు



విఘ్నేశ్వర నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న నూరిఫాతిమా

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంట మంత్రివారివీధిలోని అయ్యప్ప రెసిడెన్సీలో పూజలందుకున్న మట్టి వినాయకుని విగ్రహానికి సోమవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణతో గణపతికి ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంపాటలో లడ్డూని అత్యధికంగా రూ.54వేలకు మట్టుపల్లి నాగరాజు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వేద పండితులు తాతాచార్యులు అపార్ట్‌మెంట్‌వాసులు మహంకాళి శ్రీనివాసరావు, మద్ది రవికుమార్, కిశోర్, రాము, అనిల్, శేఖర్, మంత్రి లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

లంబోధరుడికి రథసారథిగా ఫాతిమా

పట్నంబజారు: తొలి దేవుడి ఉత్సవాల్లో లంబోధరుడికి రథసారథిగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా వ్యవహరించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ ఆటో కార్మిక సంక్షేమ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన నిమజ్జనోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆమె సరదాగా కొద్దిసేపు ఊరేగింపులో ట్రాక్టర్ నడిపి అందరిని అబ్బుర పరిచారు. భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు.

30న విశ్వబ్రాహ్మణ శంఖారావ స్ఫూర్తి దినోత్సవం



సంఘీభావం తెలియజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘీయులు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 30న శంఖారావ స్ఫూర్తి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తెలిపారు. అరండల్‌పేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో 60 వేల మందితో బ్రహ్మంగారి మఠంలో విశ్వబ్రాహ్మణ శంఖారావాన్ని పూరించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గత సంవత్సరం గుంటూరు నగరంలో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వానికి విశ్వబ్రాహ్మణ సమస్యల్ని తెలియజేసినట్లు చెప్పారు. దీనిలో భాగంగానే ఈ సంవత్సరం ప్రభుత్వ అధికారికంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకల్ని అన్ని జిల్లాల్లో నిర్వహించినట్లు తెలిపారు. దీనికి ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి విశ్వబ్రాహ్మణ జిల్లా కమిటీలు కూడా పెద్దఎత్తున పాల్గొంటాయని తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశం, తీర్మానాలు, కమిటీల ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల పంచ వృత్తుల ప్రదర్శనలో బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక, శ్రీకాళహస్తి బొమ్మలతో పాటు ఇతర విశ్వకర్మీయుల ప్రతిభకు సంబంధించి ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొలగాని నందవీరప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అద్దంకి భద్రయ్య, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ ముంజంపల్లి నాగ రాజకుమారి, జిల్లా కోశాధికారి వెంకటరమణ, నగర అధ్యక్షుడు కొంకిపూడి కోటేశ్వరరావు, సిద్ధాంతి నాగమల్లేశ్వరావు, డాక్టర్ హనుమంతరావు, పామర్తి మోహనరావు, రావణబ్రహ్మ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన నాగజ్యోతి (37) భర్త నుంచి విడిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయింది. గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ సమీపంలో సోమవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లింది. స్థానికులు గుర్తించి 108లో జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం జరిగిన సంఘ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లింపు విషయంలో గత నాలుగు నెలలుగా సాంకేతిక కారణాలు, సాచివేత ధోరణి అవలంబిస్తూ కుటుంబాల్ని మానసిక ఆందోళనకు గురి చేస్తుండటం సమాజానికి మంచిది కాదన్నారు. వేసవి సెలవుల్లో నిర్వహించిన ఉద్యోగోన్నతులు, బదిలీల్లో స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులకు జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన వేతనాల చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఇప్పటికీ రాష్ట్రంలో 30 వేల మంది ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు అందని పరిస్థితుల్లో వారి కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా వేదనకు గురి అవుతున్నాయని విమర్శించారు. సాంకేతిక కారణాలను సాకుగా చూపి కేడర్ స్ట్రెంగ్త్ ఆధునీకరణ చేయాలని విద్యాశాఖాధికారులు, ఖజానాధికారులు రోజుకో కొత్త నాటకం ఆడుతూ వేతనాల చెల్లింపును ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు వేతనాలు చెల్లించకపోతే ఉపాధ్యాయులు వారి కుటుంబాలు ఏ విధంగా జీవించాలని, బ్యాంకు, వ్యక్తిగత రుణాల నెలసరి వాయిదాలు చెల్లించలేక జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. వారంలోపు పెండింగ్ వేతనాలను చెల్లించకుంటే రాష్ట్ర ఖజానా కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, పాలడుగు ప్రసాదు, హనుమంతు ప్రసాదు, సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

తెలుగు భాష కీర్తికి బాలసుబ్రహ్మణ్యం కృషి

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: తెలుగు భాషకు కీర్తి తెచ్చేందుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిరంతరం కృషి చేశారని వీసీ పి. రాజశేఖర్ కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలో సోమవారం జరిగిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం సేవలు యావత్ దేశానికి తలమానికంగా నిలిచాయని తెలిపారు. సంగీత ప్రపంచానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ఆయన పేరుతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం భవిష్యత్తులో కల్చరల్ హబ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డ్యాన్స్, మ్యూజిక్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, డైరెక్షన్, ఫొటోగ్రఫీ వంటి కోర్సులకు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ విభాగానికి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఉన్న కళాకారుల్ని తీసుకువచ్చి విద్యార్థులకు కళారంగంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం తెలుగుజాతి గర్వించదగ్గ గాయకుడని తెలిపారు. రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఈ విభాగం ఎస్పీ బాలసుబ్రమణ్యం పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేసే స్థాయికి ఎదుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. విభాగాధిపతి డాక్టర్ జి. అనిత, కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. మధుబాబు, ఓఎస్‌డీ సునీత, సీసీడీ డీన్ కె. మధుబాబు, ప్రిన్సిపాల్స్ జాన్సన్, ఈ. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టులకు అర్హులైన వివాహిత మహిళల నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు సీడీపీవో టి. కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అంకిరెడ్డిపాలెం, అంకమ్మనగర్, గుజ్జనగుండ్ల, గోరంట్ల మేరి ప్రియనగర్, జానీనగర్ సుద్దపల్లి డొంక, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ గుంటూరు అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.